మూడు దారులు

■ నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా

రూ.2,613 కోట్లు



నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. భారతమాల పరియోజన పథకంలో భాగంగా వీటిని నిర్మించనున్నారు. ఆయా ప్రాజెక్టులు గతేడాదే మంజూరు చేశారు. తాజాగా టెండర్లు పిలిచేందుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. 204.521 కి.మీల పొడవున రూ.2,613 కోట్లు వెచ్చించి రాచబాటలు (జాతీయ రహదారులు) నిర్మించనున్నారు.



▸▸ కల్వకుర్తి- జమ్మలమడుగు జాతీయ రహదారి 167కేలో భాగంగా జిల్లాలోని సంగమేశ్వరం- నంద్యాల మధ్య 62.57 కి.మీ పొడవున పనులు చేయనున్నారు. దీన్ని రెండు వరుసలుగా నిర్మించనున్నారు. ఇప్పటికే భూ సేకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంతవరకు రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదు.

▸▸ తెలంగాణ రాష్ట్రంలోని కల్వకుర్తి దగ్గర ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి నుంచి కొల్హాపూర్, సోమశిల మీదుగా సంగమేశ్వరం వరకు నిర్మించనున్నారు. సోమశిల- సంగమేశ్వరం మధ్య తీగల వంతెన నిర్మాణం జరగనుంది.

▸▸ ఈ జాతీయ రహదారిని నాలుగు విడతల్లో నిర్మించనున్నారు. రెండు విడతలకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి.

▸▸ సంగమేశ్వరం- నంద్యాల రహదారికి రూ.601 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణంతో హైదరాబాద్- తిరుపతి ప్రయాణ దూరం సుమారు 80 కి.మీలు తగ్గనుంది.



ఎన్‌హెచ్ 167కేలో భాగంగానే కొత్తగా నంద్యాల- కడప సరిహద్దు వరకు రూ.691 కోట్లు కేటాయించారు. నంద్యాల నుంచి గోస్పాడు, రేవనూరు, కోవెలకుంట్ల, నొస్సంల మీదుగా వైఎస్సార్ జిల్లా సరిహద్దు వరకు నిర్మించే రెండు వరుసల రహదారికి నిధులు కేటాయించారు. ఈ నిధులతో భూ సేకరణతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బైపాస్ రహదారులను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిని 62 కి.మీల మేర విస్తరించనున్నారు. ఈ రహదారిని నంద్యాల వద్ద కర్నూలు- కడప నాలుగు వరుసల జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.



జాతీయ రహదారి- 440లో భాగంగా వైఎస్సార్ జిల్లా వేంపల్లె నుంచి జిల్లాలోని చాగలమర్రి వరకు 78.95 కి.మీల పొడవున రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,321 కోట్లు మంజూరు చేసింది. వేంపల్లె నుంచి ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, రాజుపాళెం మీదుగా చాగలమర్రి వరకు నిర్మించనున్నారు. ఈ మార్గాన్ని రెండు, నాలుగు వరుసల రహదారిగా నిర్మించనున్నారు. జిల్లాలో సుమారు 27 కి.మీల పొడవున ఈ రోడ్డను నిర్మించి కర్నూలు- కడప నాలుగు వరుసల జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.

శ్రీశైలం జలాశయానికి వరద

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 884.50 అడుగులు, నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైనా జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 81,491 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 67,776 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నందికొట్కూరులో కుండపోత


నందికొట్కూరు హాజీనగర్ కాలనీలో వాగును తలపిస్తున్న ప్రధాన రహదారి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 1099.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నందికొట్కూరు మండలంలో 75.8 మి.మీ కురిసింది. జూపాడుబంగ్లా 72.6, పాణ్యం 65.8, బేతంచెర్ల 64.2, దొర్నిపాడు 46.8, శ్రీశైలం 46, పాములపాడు 44.8, నంద్యాల 43, శిరివెళ్ల 42.2, బనగానపల్లి 41, పగిడ్యాల 40.6, డోన్ 40.4, బండిఆత్మకూరు 39.2, మహానంది, మిడుతూరు 38.6, గోస్పాడు 32, కోవెలకుంట్ల 31.2, ప్యాపిలి, కొత్తపల్లి 29.4, వెలుగోడు 28.6, ఆత్మకూరు 27, చాగలమర్రి 26.2, సంజామల 25.8, అవుకు 25.6, రుద్రవరం 25.2, ఉయ్యాలవాడ 21.2, గడివేముల 20.4, కొలిమిగుండ్ల 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వసూళ్ల అంగడి

■ శ్రీశైలంలో దుకాణాల కేటాయింపులో అక్రమాలు



శ్రీశైలంలో దుకాణాల కేటాయింపులో అక్రమాలు చోటుచేసుకొంటున్నాయి.. తాత్కాలిక దుకాణాల పేరుతో ఎలాంటి వేలం నిర్వహించకుండా ఏర్పాటుచేసుకొనేలా అనుమతులిచ్చి ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ఆ సాయం చేసినందుకు దుకాణాల యజమానుల నుంచి భారీఎత్తున మామూళ్లు తీసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా.. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీశైలంలో అక్రమాలపై ఓ వ్యక్తి నేరుగా దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణకు ఆదేశించగా.. విస్తుగొలిపే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి.

ఈనాడు, నంద్యాల :

● వాసవిసత్ర సముదాయానికి గత ప్రభుత్వం శ్రీశైలంలోని కరికల సత్రం ఎదురుగా ఉన్న 50 సెంట్ల స్థలం కేటాయించింది. అక్కడ చాలాకాలం నుంచి అనధికారికంగా కొందరు ఉంటున్నట్లు విచారణలో తేలింది.

● శ్రీశైలంలోని ఐవోసీఎల్ పెట్రోలు బంకు సమీపంలో ఎం.లక్ష్మీదేవికి 2019లో రూ.8 వేల అద్దెకు దుకాణం కేటాయించారు. ఆ దుకాణాన్ని ఆలయ సమీపంలోని శివసదనం వద్దకు మార్చారు. వాస్తవానికి శివసదనం వద్ద దుకాణం అద్దె విలువ అధికంగా ఉన్నా పెంచలేదు. ఆమె దుకాణాన్ని మరోచోటికి మార్చుకునేందుకు అవసరమైన అనుమతులు తీసుకోలేదు.

అధికారుల మొద్దునిద్ర

శ్రీశైలంలో ఉత్సవాల సమయంలో తాత్కాలిక దుకాణాలు నిర్వహించుకునేందుకు ఆలయ అధికారులు అనుమతులిస్తారు. వాస్తవానికి వాటిని తర్వాత కాలంలో తొలగించాలి. అందుకు విరుద్ధంగా తాత్కాలిక అనుమతులతో ఏళ్లపాటు కొనసాగుతుండటమేకాక ఎలాంటి అనుమతులు తీసుకోకనే దుకాణాలను మరింత మంచి ప్రదేశాలకు మార్చుకొన్నారు. ఫలితంగా దేవస్థానానికి భారీఎత్తున ఆర్థిక నష్టం కలుగుతోంది. కొన్ని దుకాణాలు 2013లో అనుమతులు పొంది నేటికీ ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ప్రలోభాల మత్తులో పడి దశాబ్ద కాలం నుంచి ఆలయ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారు.

లీజు గడువు ముగిసినా..

శ్రీశైలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఓ దుకాణ లీజు గడువు ఈ ఏడాది జనవరి 31వ తేదీతో ముగిసింది. దీనికి వేలం నిర్వహించాల్సిన ఉండగా ఆ విషయాన్నే పట్టించుకోలేదు. అక్కడి దుకాణం అనధికారికంగా కొనసాగుతున్నా చర్యలు తీసుకోలేదు. దుకాణాలను పారదర్శకంగా వేలం వేయాల్సి ఉండగా ఆ సంప్రదాయానికి పలువురు అధికారులు తూట్లు పొడిచారు.

మిగిలినవారిపై చర్యలు ఎప్పుడో..

ఆలయ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలతో ఎం.ఫణీంద్రప్రసాద్ అనే వ్యక్తిపై ప్రస్తుతానికి సస్పెన్షన్ వేటు వేశారు. వాస్తవానికి ఆయా అక్రమాలకు పరోక్షంగా పలువురు సహకరించారన్న ఆరోపణలున్నాయి. కిందిస్థాయి అధికారుల తప్పిదాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనా ఉంటుంది. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఇష్టానుసారంగా తరలింపు

● కర్ణభక్త సత్రం పక్కన వై.కొండారెడ్డికి తాత్కాలిక దుకాణాన్ని రూ.3 వేల అద్దెతో ఏర్పాటుచేసుకున్నారు. అనంతరం ఎలాంటి అనుమతి తీసుకోకనే ఎల్.ఐ.జి. వసతిగృహం నంబరు 49 సమీపానికి దుకాణాన్ని మార్చారు.

● ఎస్.దాసు అనే వ్యక్తి కరివెన సత్రం వద్ద రూ.2 వేల అద్దెకు తాత్కాలిక దుకాణం నడిపేందుకు అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత రెడ్డి చౌల్ట్రీ సమీపానికి మార్చుకున్నారు.

● కృష్ణవేణి అనే మహిళ ఫుడ్ కోర్టు సమీపంలో రూ.3 వేల అద్దెకు తాత్కాలిక దుకాణం ఏర్పాటుచేసుకున్నారు. ఆ తర్వాత దానిని ఎల్.ఐ.జి. క్వార్టర్ నంబరు 72 సమీపానికి తరలించారు.

● టి.వెంకటరావు అనే వ్యక్తి కరివెన సత్రం దగ్గర రూ.2 వేల అద్దెకు తాత్కాలిక దుకాణం ఏర్పాటుచేకున్నారు. తర్వాత కాకతీయ సత్రం వద్దకు మార్చుకోవడం గమనార్హం.

● ఆంజనేయస్వామివారి ఆలయం దగ్గర ఒ.వెంకటలక్ష్మి అనే మహిళ రూ.3 వేల అద్దెకు ఓ తాత్కాలిక దుకాణం ఏర్పాటుచేసుకుని తిన్నగా కమ్మవారి సత్రం వద్దకు మార్చుకున్నారు.

● కొన్ని అనధికార దుకాణాలను విచారణాధికారులు గుర్తించారు. ఆలయం పరిసరాలు మొత్తాన్ని జల్లెడ పడితే పదుల సంఖ్యలో అనుమతులు లేని దుకాణాలు వెలుగుచూసే అవకాశం ఉంది. చిన్నపాటి టీ బంకులు సైతం అనధికారికంగా ఎక్కువ సంఖ్యలోనే కొనసాగుతున్నాయి.


నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజకుమారి, వాల్మీకి సంఘం నాయకులు

రామాయణాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వాల్మీకి రచించిన రామాయణ మహా కావ్యాన్ని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. వాల్మీకి జయంతి సందర్భంగా నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ముస్తఫా అహ్మద్ తదితరులు వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పించారు.

పల్లె ప్రగతికి ప్రాధాన్యం

-మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె ప్రగతికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రహదారి, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కైపలో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. సంకాలపురానికి రూ.180 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.. ఇందులో భాగంగా ఒకేరోజు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. సంకాలపురం గ్రామ రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వర్షాకాలంలో గ్రామ ప్రజలు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చి కొన్ని నెలలే అయినా రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని వైకాపా ఆరోపించడం తగదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. దశల వారీగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని పెంచామన్నారు. త్వరలో రాయితీ సిలిండర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కైప గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రహదారులు నిర్మిస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మహిళలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిష్కరిస్తామన్నారు.

టిడ్కో ఇళ్లు అసౌకర్యాల ముళ్లు

■ సౌకర్యాలు కల్పించని అధికారులు



టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా రంగులు మార్చి వదిలేసింది.. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ టిడ్కో ఇళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దసరా లోపు లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, సొంతింటి కల సాకారం చేయాలని గట్టి ఆదేశాలు జారీచేశారు. క్షేత్రస్థాయిలో వేగంగా అడుగులు ముందుకు పడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సౌకర్యాల కల్పనలో అధికారులు దృష్టిసారించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదోని, నంద్యాల, పురపాలకం, కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:

రంగులు మార్చి వదిలేసిన వైకాపా

● 2014-19 తెదేపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలా వరకు పూర్తి చేశారు.. అంతలోనే వైకాపా అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం రంగులు మార్చి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్లు ఇవ్వడానికి గత ఐదేళ్లు తాత్సారం చేశారు.

● 365, 430 చ.అ. నివాసాలకు గత ప్రభుత్వంలో బ్యాంకు రుణాలు మంజూరు కాకపోవడం, వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో చాలా వరకు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

● గత తెదేపా ప్రభుత్వంలో 300 చ.అ. నివాసాలు మాత్రం 90 శాతం పూర్తయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం వీటి తాళాలనే లబ్ధిదారులకు ఇచ్చి చేతులు దులుపేసుకుంది.

ఎక్కడ ఎలా ఉందంటే

● కర్నూలులో 10వేల గృహాలు పూర్తి కాగా.. ఇప్పటి వరకు 800 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. మొత్తం నివాసాలు 6,112 కాగా, 4,200 నిర్మాణంలో ఉన్నాయి. ఇక్కడా 200 కుటుంబాలు గృహప్రవేశాలు చేశారని అధికారులు పేర్కొంటున్నారు.

● నంద్యాలలో 10వేల గృహాలు నిర్మించారు. 1,024 ఇళ్లు సిద్ధం చేసి 700 మందికి ఇంటి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. నివాసాల్లో 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వంద కుటుంబాలు గృహప్రవేశాలు చేశాయి.

● ఆదోనిలో 4,720 ఇళ్లు నిర్మించగా.. 1600 మందికి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. 512 గృహాల్లో 336 చివరి దశలో ఉన్నాయి. మిగిలిన 300 చ.అ. నివాసాలు 90 శాతం పూర్తయ్యాయి. వీటిలో 30-40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

● ఎమ్మిగనూరులో 4,272 ఇళ్లు నిర్మించారు. 935 మందికి తాళాలు అప్పగించారు. 365, 430 చ.అ. నివాసాలు 310 ఉంటే 200 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. ఇక్కడా 50-60 కుటుంబాలు గృహప్రవేశాలు చేశారు.

● ఆళ్లగడ్డలో 1300 ఇళ్లు నిర్మించగా.. 1200 మందికి తాళాలు అందజేశారు. డోన్‌లో 248 ఇళ్లు నిర్మించారు. ఇక్కడ కోర్టు కేసుతో తాళాలు ఇవ్వలేదు.

వీటిపై దృష్టి ఏదీ

● మార్కెట్లు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాలు, కూరగాయలు వంటి సేవలు టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● ఆదోనిలో తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. ఎమ్మిగనూరులో తాగునీరు, విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలి. రవాణా సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది.

● కర్నూలు, నంద్యాలలో ఇప్పటికే రాష్ట్ర మంత్రులు సూపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

● కూరగాయలు, కిరాణం, పాలు నిత్యావసర వస్తువులు తదితర వాటి నిర్వహణ ఆసక్తి ఉన్న పొదుపు సంఘాలకు అప్పగించాలనే ఆదేశాలున్నాయి. అధికారులు వీటిని ఆచరణలో పెట్టలేకపోతున్నారు.

● వైద్య సేవల పరంగా కొంత ఇబ్బందిగా ఉన్నా.. తాత్కాలికంగా రోజు ఓ వైద్యుడు, ఇద్దరు ఏఎన్ఎంలను టిడ్కో గృహాల ప్రాంతంలో తాత్కాలికంగా వైద్య సేవలు అందించేలా నియమించే అవకాశం ఉంది.

భూసర్వే తప్పుల దిద్దుబాటు

■ నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు ■ బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

'భూ' సర్వే అన్నారు.. విస్తీర్ణం తగ్గించారు.. హద్దులు చెరిపారు.. రైతుల మధ్య విభేదాలు సృష్టించారు.. గత వైకాపా ప్రభుత్వం హయాంలో చేపట్టిన భూముల రీసర్వే గందరగోళంగా మారింది.. వివాదాలు పరిష్కరించకపోగ పెంచి పోషించారు.. న్యాయం చేయాలంటూ కర్షకులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు.. అధికారులను నిలదీశారు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నానికి అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనుంది. వీటిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోంది.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



జిల్లా	రెవెన్యూ డివిజన్లు	జాయింట్ ఎల్‌పీఎంలు	మొత్తం ఖాతాలు
కర్నూలు	కర్నూలు	13,609	37,506
	ఆదోని	6,425	19,400
	పత్తికొండ	1,554	4,911
నంద్యాల	ఆత్మకూరు	9,365	25,535
	డోన్	3,338	10,748
	నంద్యాల	14,223	39,879

నిలిచిన రిజిస్ట్రేషన్లు

రీసర్వేలో జరిగిన సాంకేతిక లోపాల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖల సమన్వయ లోపంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

బొమ్మలు చెరిపేసేలా

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం కింద రీసర్వే గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతించారు. కర్నూలు జిల్లాలో 156 గ్రామాల్లో 2,86,352, నంద్యాలలో 145 గ్రామాల్లో 1,87,899 హద్దు రాళ్లు నాటారు. వీటిపై జగన్ బొమ్మలు, అక్షరాలను చెరిపేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అంతా తప్పులమయం

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	రీసర్వే పూర్తి
కర్నూలు	456	255
నంద్యాల	447	211

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020 డిసెంబరులో శాశ్వత భూ హక్కు-భూరక్ష పేరుతో రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. 2023 డిసెంబరు నాటికి ఉమ్మడి జిల్లాలోని 914 రెవెన్యూ గ్రామాల్లో గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉండగా 490 గ్రామాల్లో పూర్తైందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా పరిశీలిస్తే మూడేళ్లు దాటినా మూడొందలకు మించలేదు. 2024 ఫిబ్రవరి నాటికి ఉమ్మడి జిల్లాలో సమగ్రంగా పూర్తైంది 289 గ్రామాల్లోనే మరి. మరో 201 గ్రామాల్లో సర్వే అయోమయంగా మారింది.

● భూ విస్తీర్ణంలో తేడాలు.. సర్వే నంబర్లు కనిపించకపోవడం.. 5 సెంట్ల నుంచి ఎకరాలకు ఎకరాలు భూహక్కు పత్రాల్లో మాయమవడం, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా, మెట్ట భూములు, మాగాణిగా మారడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే జరిగిన ప్రతి గ్రామంలో భూవివాదలు తీవ్రమయ్యాయి. రీసర్వే మాకొద్దంటూ రైతులు ఆందోళనలూ చేపట్టారు.

15 రోజుల్లో పరిష్కారం

● రీసర్వే గ్రామాల్లో భూ విస్తీర్ణంలో తేడాలు.. ఖాతా నంబర్లు తప్పుగా ఉండటం.. పట్టా భూములు ప్రభుత్వ భూములుగా నమోదవడం.. భూ విస్తీర్ణంలో 2 సెంట్ల నుంచి ఎకరాలకు ఎకరాలు తేడాలున్నవి తదితరాలు ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఉన్నాయి. ఇక జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు 48 వేలు ఉండగా అందులో 1.37 లక్షల ఖాతాలున్నాయి. గ్రామసభలను ఆర్డీవోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐ)లు తనిఖీ చేయాల్సి ఉంది.

● తహసీల్దారు, ఉప తహసీల్దారు, రీసర్వే ఉప తహసీల్దారు (ఆర్ఎస్‌డీటీ), ఆర్ఐ, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో బృందాలుగా ఏర్పడి రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి నవంబరు 15వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి 15 రోజుల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

సర్వే నంబర్లు మాయం

● దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. భూసర్వే చేసిన గ్రామాల్లో ఐదారుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. ఇలా చేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. కొన్ని సర్వే నంబర్లు పూర్తిగా గల్లంతయ్యాయి. ఆన్‌లైన్ అడంగల్ కాపీలు కనుమరుగయ్యాయి.. భూములకు పునాదులుగా ఉన్న ఆర్ఎస్ఆర్ అదృశ్యం చేసే ప్రయత్నం చేశారు.

● గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో గతేడాది 2,500 ఎకరాల్లో పంట నమోదు చేశారు. ప్రస్తుతం 900 ఎకరాల్లో నమోదు పూర్తైంది. సుమారు 150 ఎకరాల్లో పంట నమోదు చేసేందుకు రీసర్వే సమస్యలు తలెత్తాయి. పెసరవాయిలో జాయింట్ ఎల్‌పీ నంబరు 677లో 142-2 సర్వే నంబరులో నలుగురు రైతులకు 4.42 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు కనిపించలేదు. ఎల్‌పీ నంబరులోని 533ఏ సర్వే నంబరులో బెలుం వెంకటరామ సుదర్శన్‌రెడ్డికి 2.59 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇలా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో సమస్యలు నెలకొన్నాయి.


నందికొట్కూరు మండలం అల్లూరు ప్రాంతంలో కేసీ కాలువ గట్టుపై కిలోమీటర్ల మేర ఆరబోసిన మొక్కజొన్న పంట..

మక్కిన మక్క

నందికొట్కూరు మండలం అల్లూరు ప్రాంతంలో కేసీ కాలువ గట్టుపై కిలోమీటర్ల మేర రైతులు మొక్కజొన్న దిగుబడులు ఆరబోసి ఉంచారు. వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అల్లూరుకు చెందిన మహేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన దిగుబడులను ఆరబెట్టుకుందామంటే కనీస వసతులు కరవయ్యాయని పేర్కొంటున్నారు. చివరికి కేసీ కాలువ గట్టుపై ఆరబెట్టుకోవాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తడిసిన మొక్కజొన్న దిగుబడులు కొనుగోలు చేయాలని కోరారు. – ఈనాడు, కర్నూలు

భారత్- ఆస్ట్రేలియా బంధం బలోపేతమవ్వాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : భారత్- ఆస్ట్రేలియా దేశాల బంధం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందుతోందని ఆమె తెలిపారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంటులో గురువారం ఆమె ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది.



విక్టోరియన్ పార్లమెంటు భవన్‌లో ఎంపీ శబరికి జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

విక్టోరియన్ పార్లమెంటులో ఆమె మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా భారతదేశం 4జీ, 5జీ సేవలను అన్ని రంగాల్లో విస్తరించిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దశాబ్ద కాలంలో దేశంలోని అన్ని గృహాలు విద్యుదీకరణ జరిగాయన్నారు. పేదలకు 4 కోట్ల పక్కా గృహాలు నిర్మించారన్నారు. 34 కోట్ల మంది భారతీయులను ప్రజారోగ్య బీమా పథకం కిందకు చేర్చినట్లు వివరించారు. ఈ చర్యలతో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో కొత్త రాజధాని అమరావతిని అద్భుతంగా నిర్మించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు శబరిని మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంటు సభ్యులు సన్మానించారు. ఎంపవరింగ్ కొలాబొరేషన్స్ విక్టోరియా- ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ అవార్డును అందజేశారు.

ఆటల్లో ఆగని పరుగులు

☛ అథ్లెటిక్స్, క్రికెట్‌లో నవోదయ విద్యార్థులు ☛ జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నవోదయ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్ పోటీల్లో జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. నిత్యం ఉదయం సాధన చేస్తూ ఆటల్లో రాణిస్తున్నారు ఎమ్మిగనూరు బనవాసిఫారం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు. జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందారు.

పరుగుపందెంలో ప్రథమ స్థానం

నా పేరు రాఘవేంద్ర, పదో తరగతి చదువుతున్నా. పరుగుపందెం పోటీల్లో రాణిస్తున్నాను. రోజూ మూడు గంటలపాటు సాధన చేస్తుంటాను. చిత్తూరులో జులై 7న జరిగిన 100 మీటర్ల పరుగును 11.07 సెకన్లు, 200 మీటర్లను 24 సెకన్లు, లాంగ్‌జంప్‌లో 5.35 మీటర్లు దూకి ప్రథమ స్థానం సాధించా. రీజనల్ లెవల్ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగును 11, 23 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచాను. రాంచీలో జులై 28, 29న జరిగిన జాతీయ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచా. అలాగే ఎన్‌సీసీలో కర్ణాటకలోని బెల్గాని క్యాంప్, అనంతపురంలో నిర్వహించిన క్యాంపులో 'ఏ' ధ్రువపత్రం అందుకున్నాను.



రాఘవేంద్ర

ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి

నా పేరు భరత్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నాకు క్రికెట్ క్రీడంటే ఎంతో ఇష్టం. రోజూ నాలుగు గంటలపాటు మైదానంలో సాధన చేస్తుంటాను. పశ్చిమ గోదావరిలో క్లస్టర్ లెవల్ పోటీల్లో ఆడి 47 పరుగులు, మూడు వికెట్లు తీసి రీజనల్‌కు ఎంపికయ్యాను. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లాలో జరిగిన రీజనల్ లెవెల్ పోటీల్లో రెండు వికెట్లు, 38 పరుగులు సాధించి ఆల్‌రౌండర్‌గా జాతీయ పోటీలకు ఎంపికయ్యా. హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ పోటీల్లో హైదరాబాద్ రీజనల్ తరఫున లక్నో, చండీఘర్, పట్నా జట్లతో ఆడాను. వీటిలో ఆల్‌రౌండర్ నిలవడంతో ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి అందుకున్నాను. భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది నా లక్ష్యం.



భరత్

142 పరుగులతో...

నా పేరు చరణ్‌తేజ, మాది హాలహర్వి గ్రామం. మూడేళ్లుగా క్రికెట్‌లో సాధన చేస్తున్నా. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రీజనల్ స్థాయి పోటీల్లో 35 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డాను. మూడు క్యాచ్‌లు పట్టి ఉత్తమ ఫీల్డర్‌గా ఎంపికయ్యా. రీజనల్ పోటీల్లో ఐదు ఓవర్లు వేసి 42 పరుగులు సాధించా. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో మూడు జట్లతో తలపడ్డాను. 142 పరుగులు చేసి ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి అందుకున్నాను. క్రికెట్‌లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నది నా లక్ష్యం.



చరణ్‌తేజ

స్టాంపుల కొరత.. తీరని కలత

◆ ఆకాశాన్నంటిన ధరలు ◆ రూ.పది స్టాంపు రూ.వందకు అమ్మకం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డకు చెందిన శ్రీనివాసులు గురువారం అగ్రిమెంట్ రాసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. తొలుత రూ.10 నాన్ జ్యుడిషియల్ స్టాంపు కొనుగోలుకు వెండర్ వద్దకు వెళ్తే రూ.100 ఇవ్వాలన్నారు. ఈ స్టాంప్ కొనేందుకు వెళ్తే.. అక్కడ రూ.20 ఈ స్టాంప్ ధర రూ.100 చెప్పారు. అధిక ధరకు స్టాంపులను కొని అగ్రిమెంట్ రాసేందుకు మనసొప్పక ఆయన వెనక్కి వచ్చేశారు.



ఇది ఒక్క ఆయన పరిస్థితే కాదు...ఇంచుమించుగా అందరిదీ...సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత అక్రమార్కులకు కాసుల్ని కురిపిస్తోంది. రూ.10 విలువైన స్టాంపును రూ.100లకు, రూ.100ల స్టాంపును రూ.600 నుంచి రూ.700 వరకు అమ్మేస్తుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలు చేయడం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్ జ్యుడిషియల్ స్టాంపుల రాక ఆలస్యం కావడంతో అమాంతం వాటి ధరలు పెరిగాయి. స్టాంపు విక్రేతలు అడిగినంత ఇస్తేనే ఇస్తామని తెగేసి చెబుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన ఎక్కువవుతోంది. పాత విధానంలోనే నాన్ జ్యుడిషియల్ స్టాంపులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.20 కోట్ల స్టాంపులు ఎప్పుడో..?


ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.20 కోట్ల విలువైన నాన్ జ్యుడిషియల్ స్టాంపులు రానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ఈ-స్టాంపింగ్‌పై ప్రజలు ఆసక్తిని కనబర్చడం లేదు. ఆయా స్టాంపులకు సంబంధించిన కాగితాల నాణ్యత ప్రశ్నార్థకం కావడంతో కొత్తవాటిపైనే ఆశలు పెట్టుకున్నారు. నాసిక్ నుంచి నేరుగా ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వేగంగా తీసుకురావాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా కార్యాలయాల్లో ప్రస్తుతం ఈ-స్టాంపింగ్ పత్రాల కొరత నెలకొనడంతో క్రయవిక్రయదారులు నాన్ జ్యుడిషియల్ స్టాంపులు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. 2019 ఏడాదికి ముందు వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండేవి. వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ-స్టాంపింగ్ తెచ్చింది. నకిలీ స్టాంపుల నిరోధానికి, స్టాంపు విక్రయాల్లో పారదర్శకత తెచ్చేందుకు దీన్ని తెచ్చామని గొప్పలు చెప్పింది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా తెచ్చినప్పటికీ పత్రాలు నాసిరకంగా ఉండడంతో ప్రజలు అయిష్టంగానే క్రయవిక్రయాలకు వినియోగించారు.

అధిక ధరలకు విక్రయించడం నేరం

-చైతన్య రాయల్, సబ్ రిజిస్ట్రార్, ఆళ్లగడ్డ

స్టాంపులను అధిక ధరలకు విక్రయించకూడదు. అది నేరం. ఇప్పటికే స్టాంపు విక్రయదారులతో సమావేశం నిర్వహించి హెచ్చరించాం.

కనులపండువగా ఊయలసేవ



నందవరంలోని చౌడేశ్వరి ఆలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ, ఊయలసేవ, పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు అనంతరం పల్లకి ప్రాకార ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం సహస్ర దీపాలంకరణ, ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బనగానపల్లె గ్రామీణం

ప్రహ్లాదవరదా.... పాహిమాం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రహ్లాదవరదా పాహిమాం, పూజల్లో జరిగిన తప్పులు, దోషాలకు ప్రాయశ్చిత్తం చేయాలని కోరుతూ అర్చకులు అహోబిలం లక్ష్మీనృసింహస్వామికి అర్చించారు. ఆలయ పవిత్రత, లోక కల్యాణార్థానికి పవిత్రోత్సవాలు దిగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకం జరిపారు. సంప్రదాయబద్ధంగా ద్వారతోరణ పూజ, కుంభ, మండల, అగ్నిప్రతిష్ఠలు చేసి హోమం నిర్వహించారు. స్వామి,అమ్మవారికి పవిత్రాలను ధరింపజేశారు. సాయంత్రం విశేష అలంకరణలోని స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువుంచి తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి నిత్య పూజలు చేసి హోమాలు జరిపి మంగళహారతి అందించారు. పీఠాధిపతి ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



పవిత్రమాలలతో స్వామి, అమ్మవార్లు

రంగస్వామి సినిమా పోస్టర్ విడుదల

బనగానపల్లె, న్యూస్‌టుడే: బనగానపల్లెలో 'రంగస్వామి' సినిమా పోస్టర్‌ను గురువారం రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ యువత మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రం తీయడం హర్షణీయమని తెలిపారు. చిత్ర నటీనటులు మారుతి సాకారం, దర్శకుడు నరసింహాచారి, ఇతర తారాగణం పాల్గొన్నారు.



రంగస్వామి చిత్రం పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి బీసీ

విజయ డెయిరీలో రూ.800 కోట్ల అక్రమాలు

-భూమా విఖ్యాత్‌రెడ్డి, తెదేపా నేత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విజయ డెయిరీ ఛైర్మన్ హోదాలో ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబంపై చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని తెదేపా యువనేత భూమా విఖ్యాత్‌రెడ్డి అన్నారు. గురువారం విజయ డెయిరీలో ఆయన వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. విజయ డెయిరీని తన తండ్రి భూమా నాగిరెడ్డి 25 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిపించారని, రాష్ట్రంలో ఇతర డెయిరీలు నష్టాలతో మూతపడుతుంటే..విజయ పాల డెయిరీని మాత్రం తమ కుటుంబం లాభాల్లో కొనసాగించిందన్నారు. ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న ఈ కాలంలో ఎన్నో అక్రమాలు జరిగాయన్నారు. రూ.800 కోట్ల స్కామ్ జరిగింది. రూ.3 లక్షలకు పైగా ఏ పని జరిగినా టెండరు పిలవాలన్నారు. అయితే ఆయన మాత్రం కమీషన్లకు కక్కుర్తిపడి పాలపొడి, పాలు, సోలార్ యంత్రాల కొనుగోలులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. తమ కుటుంబం అక్రమాలకు పాల్పడి ఉంటే వారెందుకు విచారణ చేయలేదన్నారు. జగన్ డెయిరీకి భూమా అఖిలప్రియ ఎలాంటి అన్యాయం చేయలేదన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధిపై ఆయన ప్రశ్నిస్తున్నారని, గత ఐదేళ్లలో ఆయన అధికార పార్టీలో ఉండి ఏమి చేశారన్నారు. త్వరలోనే విజయ డెయిరీలో ఎస్వీ జగన్ చేసిన అక్రమాలను బయటపెడతానని విఖ్యాత్‌రెడ్డి తెలిపారు.



భూమా విఖ్యాత్‌రెడ్డి, తెదేపా నేత

వాల్మీకి మహర్షి గొప్ప మానవతావాది

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యం సమస్త మానవాళికి ఆదర్శమని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పేర్కొన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి గొప్ప మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని రచించారని కీర్తించారు. కార్యక్రమంలో అర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మంజునాథ్, నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ

రవాణా భారం.. ఇసుక ప్రియం

◆ వరద నీటి ప్రవాహంతో ఆగిన తవ్వకాలు
◆ నాలుగు రోజులకు సరిపడా నిల్వలు.. ఆ తర్వాత తప్పని కొరత

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ విధానాన్ని సమర్థంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందనే విమర్శలున్నాయి. రవాణా భారాన్ని తగ్గించి, సరసమైన ధరలకు ఇసుకను అవసరార్థులకు అందించాలని భవన నిర్మాణ కార్మికులు, వినియోగదారులు కోరుతున్నారు. జిల్లాలో భవన నిర్మాణాలకు, ప్రభుత్వ అవసరాలకు తగినంతమేర ఇసుక నిల్వలు ఉన్నాయి. జిల్లా అవసరాలతోపాటు నంద్యాల, అనంతపురం జిల్లాలకు కూడా సరఫరా జరుగుతోందని జిల్లా యంత్రాంగం చెబుతున్నా, డిమాండుకు తగ్గ నిల్వలు లేకపోవడంతో జిల్లాలో ఇసుక కొరత ఏర్పడే అవకాశాలున్నాయి. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండటం, తుంగభద్ర నదిలో వరద నీటి ప్రవాహం ఉండటంతో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. మరో నాలుగు రోజులపాటు నదిలో వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే జిల్లాలో ఇసుక నిల్వలు నిండుకున్నట్లే..

ఆ మూడు రీచ్‌లు కొత్త ఏడాదికే..

కౌతాళం మండలంలో గుడికంబాలి, మరళి, నదిచాగి మూడు ఇసుక రీచ్‌లకు మంగళవారం జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ మూడు రీచ్‌లకు 2025 జనవరిలోగా పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలున్నాయి. ఈ మూడింటిలో 3-4 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉందని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి వరకు ఈ మూడు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ముందు జాగ్రత్త చర్యగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ఈసీ అనుమతుల కోరి ఉంటే ఈ అక్టోబరులోగా రీచ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉండేవని, ఇసుక అవసరార్థుల నుంచి డిమాండు ఉన్నప్పటికీ రీచ్‌లకు అనుమతులు రాకపోవడంతో ఇసుక కొరత ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.

టన్ను రూ.320..

ఇసుక కొరతతో కార్మికులు పనుల్లేక పస్తులుండే పరిస్థితి నెలకొంది. సి.బెళగల్‌లో టన్ను రూ.320 కాగా, ఇసుక కంటే రవాణా ఛార్జీలే తడిసి మోపెడవుతున్నాయి. రవాణా ఛార్జీలు టన్నుకు రూ.680 భారం పడుతోంది. సి.బెళగల్ డీసిల్టింగ్ పాయింట్ల నుంచి కర్నూలుకు వచ్చేసరికి రవాణాతో కలిపి టన్ను ధర రూ.వెయ్యి అవుతోంది. ఇక ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేలకుపైగా అమ్ముతున్నారు. ఓర్వకల్లు మండలంలో ఇసుక ట్రాక్టర్ రూ.6,500-7,000కు విక్రయిస్తున్నారు. నంద్యాల, అనంతపురం జిల్లాలకు సరఫరా చేసే ఇసుక రవాణా భారంతో అవసరమైనవారు కొనుగోలు చేయలేక నిర్మాణ పనులను నిలిపివేసుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో తుంగభద్ర, హంద్రీ నదుల నుంచి రోజుకు వందలాది ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తూ కొందరు అక్రమార్కులు దోపిడీ చేస్తున్నారు. జిల్లా మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలు అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్నేహితురాలి పెళ్లికెళ్తూ మృత్యుఒడికి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : స్నేహితురాలి పెళ్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ విద్యార్థిని మృతి చెందిన ఘటన నంద్యాల పట్టణ శివారులో చోటుచేసుకుంది. శాంతిరాం వైద్య కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి.ఫార్మసీ చదువుతున్న కీర్తి (21) మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపారు. వెలుగోడు గ్రామానికి చెందిన కీర్తి శాంతిరాం కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. పాణ్యంలో జరుగుతున్న తన స్నేహితురాలి పెళ్లికి తమ్ముడు చరణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. వెనక వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన కీర్తి మీదుగా బస్సు ముందు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ వివరించారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచానామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



కీర్తి (పాతచిత్రం)


ఆళ్లగడ్డలో పోలీసు బందోబస్తు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో తెదేపా నేత ఏవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఏవీ సుబ్బారెడ్డి ఆళ్లగడ్డకు రావడంతో పోలీసులు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. గతంలో ఉన్న పికెట్‌కు అదనంగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆళ్లగడ్డకు చాలా రోజుల తర్వాత ఆయన రావడంతో ప్రత్యర్థుల వల్ల ఏదైనా అవాంఛనీయ ఘటన జరగవచ్చనే ఆందోళన పోలీసుల్లో నెలకొంది. మధ్యాహ్నం ఆయన డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ రవికుమార్‌తో సమావేశమయ్యారు. రాత్రి 10 గంటల సమయంలో మరో మారు సీఐ చిరంజీవి, ఎస్సైలు ఏవీ ఇంటి వద్దకు చేరుకుని ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆళ్లగడ్డకు వచ్చిన కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పాటు, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు ఆయనకు వివరించినట్లు సమాచారం.

కుంగిన ఎస్సార్బీసీ కాల్వ కట్ట

అవుకు మండలంలోని మెట్టుపల్లె సమీపాన ఎస్సార్బీసీ కాల్వ కట్ట కుంగింది. పెద్ద ప్రమాదేమీ లేదని అధికారులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్లే 111వ కిలో మీటరు వద్ద కాలువ కట్ట కుంగిందని ఈఈ సురేష్‌బాబు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, రెండు రోజుల్లో మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సార్బీసీ ప్రవాహాన్ని 320 క్యూసెక్కులకు తగ్గించారు.

–న్యూస్‌టుడే, అవుకు



గృహ నిర్మాణాల్లో వేగం పెంచండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో వేగాన్ని పెంచి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, మండల ఇంజినీర్లను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై గురువారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇసుక, సిమెంటు, ఇతర సామగ్రి సరఫరాలో ఉన్న ఇబ్బందులను తొలగించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో 850 గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.1.94 కోట్ల బిల్లులు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 80 మందికి రూ.25 లక్షలు జమ చేశామన్నారు. వచ్చే వారానికి నిర్మాణాల్లో ప్రగతి కనిపించాలన్నారు. డ్వామా పీడీ జనార్దన్‌రావు, హౌసింగ్ ఈఈ హరిహరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఉపాధిహామీ లక్ష్యాలు చేరుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధిహామీ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి ఎంపీడీవోలు, మండల ఇంజినీర్లను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి గురువారం ఆమె ఉపాధిహామీ లక్ష్యాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ లక్ష్యాలను నీరుగార్చే ఏపీవోలు జిల్లాకు అవసరం లేదని స్పష్టం చేశారు. వంద రోజుల పని దినాలు కల్పించడంలో పాణ్యం, గోస్పాడు, చాగలమర్రి, బనగానపల్లి మండలాలు సున్నా ప్రగతి చూపాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నా మొక్కల పెంపకంలో డోన్, కోవెలకుంట్ల, ప్యాపిలి మండలాలు వెనకపడ్డాయన్నారు. వాటర్ షెడ్లు, గోకులం షెడ్లు పూర్తి చేయాలన్నారు. పల్లె పండగలో భాగంగా శంకుస్థాపన చేసిన సీసీ రోడ్లకు వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బనగానపల్లి ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రహిమాన్ సూచించారు. గురువారం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతి గృహంలో భోజనవసతి, ఇతర సౌకర్యాలు గురించి వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి షేక్ అబ్దుల్ రహిమాన్

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల రైతునగరానికి చెందిన శైలజ ఈనెల 16న హైదరాబాద్ నుంచి నంద్యాలకు వస్తూ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో 6.5 తులాల బంగారం ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయారు. ఆమె వెంటనే స్థానిక మూడో పట్టణ పోలీసులను సంప్రదించారు. స్పందించిన సీఐ సూర్యమౌళి ఆ బస్సులో ఉండే ప్రయాణికుల వివరాలు సేకరించారు. ఆమె సీటు పక్కనే ఉన్న ప్రయాణికుల దగ్గర సంచి ఉందని గుర్తించి బంగారం స్వాధీనం చేసుకొని గురువారం బాధితురాలుకు అందజేశారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల, న్యూస్‌టుడే : ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించే రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గడివేములలో గురువారం నిర్వహించిన ఏపీటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1, 2వ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల బోధనకు ఇబ్బందులు కలుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మానపాటి రవి, నాయకులు ఆవుల శ్రీనివాసులు, నాయకులు మహబూబ్‌బాషా, నాగన్న ఆదిశేషమ్మ, లక్ష్మీదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్నివీర్ వాయుపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నివీర్ పరీక్ష విధివిధానాలు, ఐఏఎఫ్‌లో చేరిన అగ్నివీర్‌లకు లభించే ప్రోత్సాహకాల గురించి సందీప్, సురేందర్ వివరించారు. డీవీఈవో సునీత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్. శశికళ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : సమస్య : నడిగడ్డలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. - **సలీం**

సమస్య : సరస్వతీనగర్‌లో కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. - **లక్ష్మీదేవి, స్థానికురాలు**

సమాధానం : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. త్వరలోనే కుక్కలు, కోతులను పట్టిస్తాం. - **లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**


నందికొట్కూరు : చెరువులా మారిన పొగాకు పొలం


వడ్డెమాను సమీపంలో మొక్కజొన్నలో చేరిన నీరు


అల్లూరు సమీపంలో మునిగిన ఉల్లిపంట

పంట మునిగింది..

నష్టమే మిగిలింది

◆ తడిసి ముద్దయిన మొక్కజొన్న దిగుబడులు
◆ భారీవర్షం అప్పులపాలు చేసిందని రైతుల ఆవేదన


నందికొట్కూరు శివారులో తడిసిన మొక్కజొన్నలను ఆరబెట్టిన రైతులు

నందికొట్కూరు, నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతుల పాలిట అధిక వర్షాలు శాపంగా మారాయి. మొదట్లో కురిసిన భారీ వర్షాల వల్ల సగానికి పైగా పంట దెబ్బ తింది. మిగిలిన దాన్ని అష్టకష్టాలుపడి కాపాడుకున్నారు. తీరా దిగుబడులు చేతికొచ్చే సమయంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న జడివాన పొలాలను ముంచెత్తింది. ఓవైపు పొలాల్లో భారీగా నీరు నిలిచి పంటలు కుళ్లిపోతున్నాయి. మరోవైపు కోత కోసి ఆరబెట్టుకున్న దిగుబడులు తడిచి మొలకలొస్తున్నాయి. దీంతో రెక్కల కష్టం నీటిపాలవగా.. నష్టాలే మిగిలాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.


ఎదురుపాడు గ్రామంలో మొలకెత్తిన మొక్కజొన్నలు

ఆరబెట్టుకునేందుకు అవస్థలు


నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోతగా వాన కురిసింది. దీంతో అన్నదాతలు అతలాకుతలం అవుతున్నారు. చేతికొచ్చిన పంట దక్కకుండాపోతోందని ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న కోసి నూర్పిడి చేసిన రైతులు దిగుబడులను ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మొక్కజొన్నలు తడిస్తే తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తుందని భయపడుతున్నారు. కొన్నిచోట్ల కాటా వేసిన బస్తాలు కూడా తడిచి ముద్దయ్యాయి. మార్కెట్‌లో మొదట క్వింటా రూ.2,200 నుంచి 2,400 వరకు ధర పలికాయి. ప్రస్తుతం రూ.1800 నుంచి రూ.2 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు.

మొలకలొస్తున్న మొక్కజొన్నలు

తడిచిన మొక్కజొన్న దిగుబడులను ఆరబెట్టుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఎండ వచ్చిందని కదా అని ఆరబెట్టిన నిమిషాల్లోనే మళ్లీ వర్షం పడి దిగుబడులను తడిపేస్తోంది. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నందికొట్కూరు పట్టణ శివారులోని జీవనజ్యోతి పాఠశాల వద్ద, 340సీ జాతీయ రహదారిపై పలువురు దిగుబడులు ఆరబెట్టుకున్నారు. నందికొట్కూరు, బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, 10 బొల్లవరం తదితర గ్రామాల్లో కూడా రహదారులపైనే ఆరబోస్తున్నారు. అవి సరిగా ఆరక గింజల నుంచి మొలకలు వస్తున్నాయి. కొన్నిచోట్ల బూజుపట్టాయి. దీంతో దళారులు అడిగిన ధరకు అమ్మాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కోసిన పంటను వర్షం ముంచెత్తడంతో నీటిలో తేలుతున్న ఉల్లిగడ్డలు

పంట నీటి పాలైంది - చిన్నబాషా, మల్యాల



నేను రెండెకరాల్లో ఉల్లిపంట సాగు చేశా. రూ.80 వేల పెట్టుబడి పెట్టాను. పంటను భూమి నుంచి తొలగించి ఉల్లిగడ్డలను వేరు చేసేందుకు సిద్ధం చేసుకున్నా. ఇంతలోనే భారీ వర్షం కురవడంతో ఎకరం పంట మునిగిపోయింది. నీరు తగిలితే గడ్డలు కుళ్లిపోతాయి. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదు.

దిగుబడులు బూజు పట్టాయి - వహీద్‌మియ్య, దామగట్ల



నేను ఏడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట నూర్పిడి చేస్తే ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడులను 340సీ జాతీయ రహదారిపై ఆరబెట్టుకున్నా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టల కిందికి వర్షంనీరు చేరి మొక్కజొన్నలు తడిచిపోయాయి. కిందవైపు బూజుపట్టాయి. వీటిని కాపాడుకునేందుకు నలుగురు కూలీలను పెట్టుకుని కష్టపడుతున్నా. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

తక్కువ ధరతో నష్టం తప్పదు - ధనుంజయగౌడ్, ఎదురుపాడు



నేను ఆరెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. నాలుగు రోజుల కిందట పంటను కోశా. సుమారు 180 క్వింటాళ్ల దిగుబడులు ఆరబెట్టాను. వర్షానికి 50 క్వింటాళ్లపైగా తడిసిపోయాయి. అక్కడక్కడ మొలకెత్తాయి. తడిసిన దిగుబడులను తక్కువ ధరకే అడుగుతున్నారు. దీంతో నష్టమే మిగిలేలా ఉంది.


నందికొట్కూరు : మారుతీనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షంనీరు


నందికొట్కూరు : చెరువులా సాయిబాబాపేటలోని ప్రాథమిక పాఠశాల మైదానం

జడివాన..

ఇబ్బందులు చానా


పాణ్యం గ్రామీణం : పాణ్యం- గోరుకల్లు రహదారిపై పారుతున్న వాగు నీరు

అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. నందికొట్కూరు పట్టణంలో గురువారం తెల్లవారుజామున 7.58 సెం.మీల వర్షం కురిసింది. పలు కాలనీలు జలమయం అయ్యాయి. మారుతీనగర్, హాజీనగర్, సాయిబాబాపేటలోని ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు ప్రవహించడంతో 4 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సాయిబాబాపేట రహదారులు వంకలను తలపించాయి. పాణ్యం మండలం వర్షాలకు పంటలు మునిగిపోయాయి. పాణ్యం- గోరుకల్లు రహదారిపై వాగునీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాల పట్టణంలో మురుగు కాల్వలు పొంగి రహదారులు, లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం


నందికొట్కూరు : వడ్డెమానులో జల దిగ్బంధంలో అంగన్‌వాడీ, గ్రామ సచివాలయ భవనాలు




నంద్యాల పాతపట్టణం : మురుగు కుంటలా పద్మావతినగర్‌లోని పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణ


నందికొట్కూరు : చెంచుకాలనీలో నివాసాలను పరిశీలిస్తున్న పురపాలక కమిషనర్, ఉప ఛైర్మన్, కౌన్సిలర్, వీఆర్వో

ఉర్దూ పండిట్ పోస్టుల భర్తీకి చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కృషితో దిల్లీ ఎంహెచ్ఆర్‌డీ రాష్ట్రానికి మంజూరు చేసిన 238 ఉర్దూ పండిట్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తెలిపారు. జిల్లా ఇమామ్‌ల



మాట్లాడుతున్న తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్

సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ షాదీ ఖానాలో గురువారం ఉర్దూ సాహితీవేత్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉర్దూ సెమినార్‌లో డా.అబ్దుల్‌హఖ్ ఉర్దూ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.ఎస్ఎస్. మొయినుద్దీన్, కడప ఉర్దూ సాహిత్యవేత్తలు సత్తార్‌ఫైజీ, మగ్బుల్ అహ్మద్, ఉర్దూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కన్వీనర్ సి.అబ్దుల్ అజీజ్ పరిశోధన పత్రాలు, వ్యాసాలు సమర్పించారు. వారితో పాటు విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఫిరోజ్ ప్రశంసాపత్రాలు, పతకాలతో సత్కరించారు. కౌన్సిలర్లు కండే శ్యామ్‌సుందర్‌లాల్, నాగార్జున, ఉర్దూ డీఐ అస్మద్దీన్, మౌలానా మహబూబ్‌బాషా, ప్రోగ్రాం కన్వీనర్లు అబ్దుల్ అజీజ్, అంజాద్ షరీఫ్, కార్యనిర్వాహక కార్యదర్శి షమీమ్‌బాను, షమీమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం మహా గణపతి, దత్తాత్రేయ, శ్రీకృష్ణ, వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, షిర్డీ సాయిబాబా, నందీశ్వర విగ్రహాల


ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

ప్రతిష్ఠోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా పౌర్ణమి హోమాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని అమ్మ స్ఫటిక లింగేశ్వర ఆలయంలో ఆశ్వీయుజ మాస పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం హోమాలు నిర్వహించారు. యోగానంద ఆధ్వర్యంలో స్ఫటిక లింగేశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాంధీ, తిమ్మయ్య, అనిల్, యోగా బృందం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ గేట్ల వేలాలు వాయిదా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల మార్కెట్ గేట్ల వేలాలు మరోసారి వాయిదా పడ్డాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేలాలను పోటీ లేని కారణంగా వాయిదా వేసినట్లు సహాయ కమిషనర్ డా.అంకిరెడ్డి తెలిపారు.

ఆగిన లారీ.. ట్రాఫిక్‌జామ్

గోపవరం (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం గోపవరం మెట్ట వద్ద ఓ గోదాము నుంచి వరి ధాన్యం తీసుకెళ్తున్న లారీ గురువారం రాత్రి నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిపై సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఇతర వాహనాల చోదకులు, ప్రయాణికులు రెండు గంటల పాటు శ్రమించి లారీని పక్కకు జరిపడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి.

ఊరూరా వాల్మీకి జయంతి వేడుక

నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో మహర్షి చిత్రపటాలను ఊరేగించారు. సున్నిపెంట రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు నగదు అందజేశారు. – న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం


సున్నిపెంట సర్కిల్ : వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


ఆత్మకూరు పట్టణం : నివాళులర్పిస్తున్న పురపాలక ఛైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా, కమిషనరు రమేష్‌బాబు


మిడుతూరు : సుంకేసుల గ్రామంలో వాల్మీకి విగ్రహం ఊరేగింపు


కొత్తపల్లి : ముసలిమడుగు బోయపేటలో వేడుకలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు


మహానంది : పుట్టుపల్లెలో వాల్మీకి చిత్ర పటానికి పూజలు చేస్తున్న తహసీల్దారు రమాదేవి


పాణ్యం గ్రామీణం : వాల్మీకి రామాలయం వద్ద మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

భయపెడుతున్న పాత / పూర్తవని కొత్త

వంతెన

◆ భారీ వర్షాలతో నంద్యాల ప్రజలకు దిగులు ◆ ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల శివారులోని కుందూనదిపై చేపట్టిన కొత్త వంతెన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే మిగిలింది. ప్రస్తుతం భారీ వర్షాలకు కుందూనది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు పాత వంతెన శిథిలావస్థకు చేరింది. దీనిపై దారి మొత్తం గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు కష్టంగా మారాయి. వరదల సమయం కావడంతో పాత వంతెనపై ప్రయాణం చేసేందుకు ప్రజలు భయపడుతున్నారు. కొత్త వంతెన త్వరగా పూర్తి చేసి కష్టాలు తీర్చాలని ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.


దెబ్బతిన్న పాత వంతెన


అసంపూర్తిగా కొత్త వారధి

◆ కుందూనదిపై ఉన్న పాత వంతెన మీదుగా నందమూరినగర్, వైఎస్సార్ నగర్, రాయల్‌హోమ్స్‌తో పాటు నంద్యాల మండలంలోని రాయమాల్పురం, పులిమద్ది, మునగాల, పోలూరు, పాణ్యం మండలంలోని గోరుకల్లు, కొండజూటూరు, కొరటమద్ది, గడివేముల మండలంతో పాటు నందికొట్కూరు, జిందాల్ సిమెంటు పరిశ్రమ తదితర ప్రాంతాలకు ప్రజలు రాకపోకలను సాగిస్తున్నారు. శిథిలావస్థలోని ఇరుకు వంతెన వల్ల వీరంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏడేళ్లుగా ఎక్కడి పనులక్కడే

వేలాదిమంది ప్రజల సమస్య పరిష్కారం కోసం 2017లో జులై 23న అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.7.33 కోట్ల నిధులతో కుందూనదిపై నూతన వంతెన నిర్మాణం ప్రారంభించారు. 300 మీటర్ల పొడవున రెండు వరుసల వంతెన నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు 180 మీటర్లు మాత్రమే పూర్తయింది. రూ.5 కోట్లు వ్యయం చేశారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పూర్తిగా నెమ్మదించాయి.

భూ సేకరణే అసలు సమస్య

వంతెన నిర్మాణంలో భాగంగా భూమి సేకరించాల్సి ఉంది. ఇందుకు భారీ మొత్తంలో నిధులు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. భూ సేకరణ జరిగితే గాని కొత్త వంతెన పూర్తిచేసి ఇరువైపులా రహదారులను అనుసంధానం చేసే అవకాశం ఉండదు.

సీఎం దృష్టికి తీసుకెళ్లాం - ఫరూక్, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి

కుందూ వంతెన నిర్మాణాన్ని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లా. భూ సేకరణకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరాను. ముఖ్యమంత్రి దస్త్రాన్ని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ వద్దకు పంపించారు. త్వరలో సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సున్నిపెంటలో గురువారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.3.20 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సున్నిపెంటను టెంపుల్ టూరిజం ద్వారా అభివృద్ధి చేసి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. తహసీల్దారు శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజలి, డీఆర్‌డీఏ ఏపీఎం మధుబాబు, తెదేపా శ్రీశైలం మండల సమన్వయకర్త యుగంధర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరు అభివృద్ధికి కృషి చేస్తానని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం అల్లూరులో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచి రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం సీతారామపురంలో గురువారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మసీదుపురంలో నరాల చంద్రమౌళీశ్వరరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణాలు వద్దు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయం సమీపాన, నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయకూడదని కాలనీవాసులు, వామపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానికులు, వామపక్ష నాయకులు గురువారం కాలనీలో నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు వెంకటేశ్వర్లు, పక్కీర్‌సాహెబ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు దుకాణాలు ప్రారంభించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: లాటరీ పద్ధతిలో దక్కించుకున్న మద్యం దుకాణాలను నిబంధనల మేరకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సూచించారు. నందికొట్కూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. స్థానిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పాలసీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. గుడి, బడి, చర్చి, మసీదులకు వంద మీటర్ల దూరంలో దుకాణాలు ఉండేలా చూడాలన్నారు. సీఐ రామంజనేయులు, ఎస్సై జఫ్రుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.


సీఐతో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. గురువారం ఆర్టీసీ కార్యాలయంలోని క్యాంటీన్‌లో చోదకులు, మెకానిక్కులు, కండక్టర్లకు డీఎం శశిభూషణ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాషా మాట్లాడారు. సెప్టెంబరులో ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన కండక్టర్లు, చోదకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఆర్టీసీ చోదకులు, మెకానిక్‌లకు అవగాహన కల్పిస్తున్న బాషా

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

డోర్నిపాడు: సమస్య: ఉమాపతినగర్‌లో రోడ్లపై వర్షపు నీరు నిలుస్తోంది. కాల్వలోకి నీరు పారేలా చర్యలు తీసుకోవాలి. - సుబ్బరాయుడు.

సమాధానం: చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, సర్పంచి, గుండుపాపల.

డోన్‌పట్టణం: సమస్య: తారకరామానగర్‌లో మినీ పార్కు పక్కనున్న దారిలో చెత్త కుండీ వద్ద వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది.

- శ్రీనివాసులు, తారకరామానగర్.

సమాధానం: సిబ్బందితో తొలగిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574316
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

-సునీల్, తాత్కాలిక శానిటరీ అధికారి.

సమస్య: కొత్త ఇందిరానగర్‌లో సీసీ రహదారులు, కాల్వలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -లక్ష్మన్న, కొత్త ఇందిరానగర్

సమాధానం: కాలనీ సందర్శించి రోడ్లు, కాల్వలకు ప్రతిపాదనలు రూపొందించి నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ

అవీ.. ఇవీ.. అన్నీ..

సంజామల, న్యూస్‌టుడే: ఈ నెల 22 నుంచి 25 వరకు సంజామల మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సల్మాన్ చెప్పారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన ఉప సర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులకు శుక్ర, శనివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫజల్ రహిమాన్ గురువారం తెలిపారు.

సంజామల: గ్రామ పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు ఇద్దరికి శుక్ర, శనివారాల్లో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో సల్మాన్ గురువారం చెప్పారు.

బోయవాండ్లపల్లె(ప్యాపిలి): బోయవాండ్ల పల్లె సమీపంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు జలదుర్గం ఎస్సై నాగార్జున తెలిపారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, రెండు డ్రమ్ములు, ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బూరుగల (ప్యాపిలి), న్యూస్‌టుడే: నల్లల నివారణతో మూగ జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. బూరుగలలో గొర్రెలు, మేకలకు నల్లల నివారణ మందు అందించారు.

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం): మునగాకులో ఉండే పోషకాలను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. పలుకూరులో ఆమె ఆధ్వర్యంలో గురువారం మునగాకుపై అవగాహన కల్పించారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను డోన్‌కు చెందిన న్యాయవాది లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్ గురువారం కలిశారు. డోన్ సీఐ ఇంతియాజ్ బాషా న్యాయవాదులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని వినతిపత్రం అందజేశారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: గొరుమానుకొండ మెట్ట వద్ద ఉన్న ఏపీ బీసీ గురుకుల పాఠశాల వాచ్‌మేన్‌తో పాటు మరో ఇద్దరు విద్యార్థులపై దాడులకు పాల్పడ్డాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి చికిత్స అందించారు.

డోన్: డోన్ మండల తెదేపా అధ్యక్షుడు సలీంద్ర శ్రీనివాసులును రాష్ట్ర సీడ్ కార్పొరేషన ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డితో పాటు నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర రావు యాదవ్, వలసల రామకృష్ణ గురువారం పరామర్శించారు.

డోన్, న్యూస్‌టుడే: డ్రైవర్ల మెడకు ఉరితాడులాంటి చట్టాలను రద్దుచేయాలని కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్, ఎల్లయ్య అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆటో, ఐచర్, ప్రైవేటుపాఠశాలల బస్సులు, ఆర్టీసీ అద్దె బస్సుల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 19, 20వ తేదీల్లో ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర వర్కుషాపు నంద్యాలలో జరుగుతుందని దీన్ని జయప్రదం చేయాలన్నారు.

అవుకు: సచివాలయాల్లో వైద్య సిబ్బంది పనితీరుపై వైద్యఆరోగ్యశాఖకు చెందిన నిఘా విభాగం అధికారులు గురువారం పరిశీలించారు. సచివాలయాల్లో సిబ్బంది పనితీరు, అందుతున్న సేవల్ని తెలుసుకొని దస్త్రాలను పరిశీలించారు. ప్రతి విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మాతా శిశు సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షం మిగిల్చిన గాయం

☛ మొలకలెత్తిన మొక్కజొన్న గింజలు..
☛ రైతుల ఆశలన్నీ అడియాసలే



మొలకలెత్తిన్న మొక్కజొన్న గింజలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు నట్టేట మునిగారు. రాత్రనకా పగలనకా ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో వర్షార్పణం అవ్వడంతో తీవ్ర వేదనకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి, మల్లె పూల తోటలు మునిగిపోయాయి. ఒకవైపు పొలాల్లోని పంటలు మునిగి నష్టపోతే, మరో వైపు చేతికొచ్చిన దిగుబడులను ఆరబెట్టుకుని అమ్ముకునేందుకు సిద్ధమైన వేళ అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. రోడ్లపై ఆరబెట్టుకున్న మొక్కజొన్న గింజలు మొలకెత్తడంతో మండలంలోని మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఈ ఏడాది అప్పులు తీరతాయనుకున్నా

- ఉపేంద్ర, రైతు, చక్రవర్తులపల్లె.



మూడేళ్లుగా వర్షాభావం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటలు సరిగా పండక అప్పులు చేశాం. ఈ ఏడాది ఐదెకరాల్లో మొక్కజొన్న వేస్తే దాదాపు 150 క్వింటాళ్ల మేర పంట దిగుబడి వచ్చింది. ధాన్యం ఆరితే ఎంతో కొంత సొమ్ము చేసుకోవచ్చని ఎన్నో ఆశలతో ఉన్నాను. అనుకోకుండా వచ్చిన తుపాను వల్ల ధాన్యమంతా తడిసి మొలకలెత్తింది. మొలకలెత్తిన మొక్కజొన్న గింజలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

రెండెకరాల్లోని దిగుబడంతా మొలకెత్తింది

- శేఖర్, రైతు ముత్యాలపాడు.



నాకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. వచ్చిన దిగుబడిని రహదారిపై ఆరబెట్టాను. వర్షానికి తడవకుండా పట్టలు కప్పాను. భారీ వర్షం కురవడంతో పట్టలుకూడా కాదని ధాన్యం తడిచింది. నేడు రెండెకరాల్లోని దిగుబడంతా మొలకెత్తింది. తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

కూలిన మట్టిమిద్దెలు

చాగలమర్రి, న్యూస్‌టుడే: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత మట్టిమిద్దెలు కూలాయి. మల్లెవేములలోని హరిప్రసాదుకు చెందిన మిద్దె కూలడంతో గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. పట్టణంలోని నాగులకట్ట వీధికి చెందిన జింక చిన్నహుసేన్‌వలి మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ. 3 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు



కూలిన మట్టిమిద్దె



వల్లంపాడు దగ్గర పొంగిన నల్లవాగు

పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల గ్రామాల మధ్య కైపా వాగు, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు మధ్య నల్లవాగు, వల్లంపాడు దగ్గర కప్పలవాగు, లింగాల దగ్గర పాలేరు వాగులు పొంగి పొర్లుతున్నాయి.

అవుకు, న్యూస్‌టుడే: పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో శివవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న బనగానపల్లి-శివవరం రహదారి కోతకు గురై గురువారం రాకపోకలకు ఆటంకాలు కలిగాయి.



కొలిమిగుండ్ల: వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న సభ్యులు



డోన్: వాల్మీకి విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన వాల్మీకి సంఘ నాయకులు



కోవెలకుంట్లలో ఊరేగింపు

వైభవంగా వాల్మీకి జయంతి

వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని పలు గ్రామాల్లో ఊరేగించారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే బృందం.



ఆళ్లగడ్డ: వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బోయలు



బనగానపల్లిలో ర్యాలీగా వెళ్తునన వాల్మీకి సంఘం నాయకులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

పెద్దబోధనం (చాగలమర్రి), న్యూస్‌టుడే: పెద్దబోధనం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి యశ్వంత్ పుస్తక సమీక్షా పోటీల్లో తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నాడని తెలుగు ఉపాధ్యాయిని మారంరెడ్డి నాగేశ్వరమ్మ తెలిపారు. పురిమళ్ల ఫౌండేషన్ (ఖమ్మం), అక్షరాలతోవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురిమళ్ల ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షలో విద్యార్థి ప్రతిభ చూపాడని అభినందించారు. ప్రధానోపాధ్యాయిని కాత్యాయని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థితో ఉపాధ్యాయులు

కౌమార దశలో ఆరోగ్యంపై దృష్టి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: కౌమార దశలో బాలికలు మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి కాంతారావు తెలిపారు. గురువారం పట్టణంలోని డా. బి. ఆర్. అంబేడ్కర్ గురుకులంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



మాట్లాడుతున్న కాంతారావు

క్రైం కార్నర్

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన పుష్పవతిని అదే కాలనీకి చెందిన భర్త నాగరాజు, మామ వడ్డే నాగమద్దయ్య, అత్త కృష్ణమూర్తితో పాటు ఇద్దరు ఆడ పడచులు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు అయిదుగురిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన తలారి మద్దిలేటి రైల్వే బ్రిడ్జి కింద సారా విక్రయిస్తుండగా 20 లీటర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటనారాయణ గురువారం తెలిపారు.

చెర్వుపల్లి (బనగానపల్లి గ్రామీణం): చెర్వుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అక్కమ్మను అరెస్టు చేసి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కోవెలకుంట్ల: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి గురువారం తెలిపారు. సాయినగర్ కాలనీలో దస్తగిరి తన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని 15న రాత్రి ఇంటి ముందర ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు.

గడ్డి మందు తాగి మృతి

కోవెలకుంట్ల గ్రామీణం: సౌదరదిన్నెలో ట్రాక్టర్ డ్రైవర్ ఎం. మహబూబ్ బాషా మంగళవారం రాత్రి గడ్డి మందు తాగగా.. కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి,అక్కడి నుంచి నంద్యాలకు, కర్నూలు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

గ్రామీణాభివృద్ధే ధ్యేయం: కోట్ల



సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన కోట్ల

బూరుగల(ప్యాపిలి), న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బూరుగలలో 'పల్లె పండుగ'లో భాగంగా రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు గురువారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. హుస్సేనాపురం, చంద్రపల్లె, ఊటకొండ, బావిపల్లె, కొమ్మెమర్రి గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పల్లె పండుగ నిర్వహించారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, అలేబాద్ పరమేష్, కొమ్మెమర్రి వెంకట్రాముడు, బావిపల్లె లింగన్న, పీఆర్‌ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఈవోఆర్డీ బాలకృష్ణ, ఏపీవో రమణ పాల్గొన్నారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ హైవే పెట్రోలింగ్ వాహనం డోన్‌కు రావడం శుభపరిణామమని కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహం వద్ద హైవే పెట్రోలింగ్ వాహనాన్ని కోట్ల, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభించి, పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ముందుకు కదిపారు.

క్రిష్టిపాడు(దొర్నిపాడు): క్రిష్టిపాడులో ఎంపీడీవో సావిత్రి అధ్వర్యంలో 'పల్లె పండుగ' గురువారం నిర్వహించారు. బీసీ, ఎస్సీ కాలనీలకు సంబంధించి రూ.20 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేపట్టారు.

బలపాలపల్లె(బేతంచెర్ల): పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెదేపా సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, ఉన్నం సుధాకర్ పేర్కొన్నారు. బలపాలపల్లెలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సిమెంట్‌నగర్ (బేతంచెర్ల),న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో అందరి సహకారంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అవుతుందని మండల ప్రత్యేక అధికారిణి నసీరున్నీషా బేగం, ఎంపీడీవో పేర్కొన్నారు. సిమెంట్‌నగర్‌లో సర్పంచి ఎస్తేరమ్మ, స్థానిక తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

పాతపాడు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: పాతపాడు, మీరాపురం, సాధుకొట్టం, కటికవానికుంట, మాదాసుపల్లి గ్రామాల్లో ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో పల్లెపండుగ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. పాతపాడు గ్రామంలోని సీసీ రహదారులకు ఉపాధి హామీ పథకం పీడీ జనార్దన్‌రావు పాల్గొని భూమిపూజ చేశారు. సర్పంచి మహేశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం: ఎం. ఉప్పలూరులో గురువారం పల్లె పండుగ నిర్వహించారు. బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో వరప్రసాదరావు, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం: లింగాలలో గురువారం పల్లెపండుగ నిర్వహించారు. ఎంపీయూపీ పాఠశాల సమీపంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు.

కోవెలకుంట గ్రామీణం: రేవనూరులో పల్లె పండుగ నిర్వహించారు. బీసీ కాలనీలో రూ. 30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు. ఎంపీడీవో వరప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ రెడ్డి, సర్పంచి సరస్వతమ్మ, ఏవీ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్.జమ్మలదిన్నె(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: పల్లెపండుగలో భాగంగా రూ.53 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆర్. జమ్మలదిన్నె, హరివరం, పెద్దయమ్మనూరు గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. రమేష్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాలు ముంచెత్తగా



పట్టణంలోని ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఐసీ కార్యాలయం నుంచి పాతబస్టాండుకు వెళ్లే రహదారిలో సగం రోడ్డుకు పైగా ఉన్న వ్యర్థాలను తొలగించలేదంటున్నారు. ఈవో సతీష్‌కుమార్‌రెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బనగానపల్లి

నిలిచిన నీరు.. కష్టాలు జోరు

రోడ్ల అభివృద్ధిని గత వైకాపా పట్టించుకోకపోవడంతో గుంతలు తేరి నరకాన్ని చూపుతున్నాయి. మిక్కినేనిపల్లె ప్రధాన రహదారితో పాటు రెండు అంతర్గత రోడ్లు కలిసే కూడలి ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. దీంతో మోకాలిలోతుకు పైగానే గోతులు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంజామల



అధ్వానదారి.. ఇక్కట్లే మరి



పురపాలక పరిధిలోని త్రివర్ణకాలనీలో కుళాయి నీటి గొట్టం లీకేజీకి గురి కావడంతో సిబ్బంది మరమ్మతులకు సీసీ రహదారిపై తవ్వడంతో పాడైంది. పుర అధికారులు స్పందించి దెబ్బతిన్న చోట సీసీ ప్యాచ్ వర్కుతో బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

సుపరిపాలన అందించిన ధీరుడు రాయలు



కృష్ణదేవరాయలుకు నివాళులు అర్పిస్తున్న బలిజలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: కృష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా గాంధీ సెంటరులో ఆయన విగ్రహానికి ఆళ్లగడ్డ బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గురువారం వారు మాట్లాడుతూ సుపరిపాలన అంటే ఏమిటో దేశానికి చాటి చెప్పిన ఘనత కృష్ణదేవరాయలదేనని తెలిపారు. సంఘం అధ్యక్షుడు నల్లగట్ల బాలుడు, డా. ఎంవీ ప్రసాదు, మైలేరి మల్లయ్య, అర్జిగారి నరసింహుడు, సిద్ధి సత్యం, రాందాసు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: సంగీత కళలను పోషించిన మహనీయుడు శ్రీకృష్ణ దేవరాయలని ఉయ్యాలవాడ బలిజ సంఘం అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య అన్నారు. శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతిని పురస్కరించుకొని గురువారం



కృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బలిజ నాయకులు

ఉయ్యాలవాడలో బలిజ సంఘం నాయకులు, కార్యకర్తలు కలిసి రాయల ప్రతిమకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.



టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యపై శ్రద్ధ

చిన్నపూదెళ్ల(ప్యాపిలి), న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యపై శ్రద్ధ చూపుతారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారిణి విజయకుమారి, ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్రగౌడు పేర్కొన్నారు. చిన్నపూదెళ్లలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీసీజీ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. మోహన్, చంద్రకళ, ఆశా రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లేక కలవరం

★ ఏళ్ల పాటు జనాలకు అవస్థలు
★ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి మేజర్ పంచాయతీలో మురుగు కాలువలు లేక వ్యర్థాలన్నీ రోడ్లపైకి వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. నవాబుల కాలంనాటి మురుగు కాలువలే దిక్కయ్యాయి. చిన్నపాటి వర్షం వస్తే చాలు.. కాలువలన్నీ నిండిపోయి రోడ్లపైనే మురుగు పారుతోంది. మేజర్ పంచాయతీకి ఆదాయం ఏడాదికి రూ.కోటికి పైగానే వస్తున్నా ప్రజల సమస్యల్ని పట్టించుకోవడం లేదని, కూటమి ప్రభుత్వమే చర్యలు చేపట్టాలని జనాలు ఆశపడుతున్నారు. మూడేళ్ల కిందట మురుగు కాలువల కోసం సుమారు రూ.3కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. పనులన్నీ కొన్ని కాలనీలకే పరిమితమవ్వడంతో మిగతాచోట్ల సమస్య పరిష్కారం కాలేదు.



రంగరాజుపేటలో ఇళ్ల ముందు ఆగి పోయిన మురుగు

ప్రధానంగా ఎక్కడెక్కడంటే...?

రంగరాజు పేట కాలనీలో నవాబుల కాలం నాటి మురుగు కాలువలే దర్శనమిస్తాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చుట్టుపక్కల కాలనీ వాసులు, అటుగా వెళ్లే ప్రజలు ముక్కుమూసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. లోతుగా తవ్వి సిమెంట్ లైనింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ సుమారు రెండు వందల నుంచి నాలుగు వందల కుటుంబాలు ఉంటాయి. దినసరి మార్కెట్, ఇతర వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగాన ఉన్న ఎస్సీ, బీసీ కాలనీల్లోనూ ఇలాంటి పరిస్థితినెలకొంది. ఖాజీవాడ కాలనీలో మురుగు వ్యవస్థ అధ్వానంగా మారింది.

లెక్కల్లో ఇలా...

బనగానపల్లి:	మేజర్ పంచాయతీ
ఆదాయం:	రూ.కోటికి పైగానే
జనాభా:	సుమారు 40వేలు
వార్డులు:	20
పారిశుద్ధ్య కార్మికులు:	70 మంది

మంత్రి సహకారంతో అభివృద్ధి

- సతీష్ కుమార్‌రెడ్డి, ఈవో

కొత్త ప్రభుత్వం వచ్చింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో మురుగు కాలువల అభివృద్ధికి కృషి చేస్తాం. పట్టణంలో ఉన్న సమస్యను మంత్రికి వివరిస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. గతంలో ఇక్కడ చాలా వరకు మురుగు కాలువ పనులు చేశాం. మిగిలి పోయిన వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

పల్లె కబుర్లు

కోవెలకుంట్ల గ్రామీణం: అమడాల: అమడాలలో వాల్మీకి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

వల్లంపాడు: వల్లంపాడులో పెద్దలు, ప్రజల సహకారంతో వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

కంపమల్ల: కంపమల్ల బుచ్చమ్మకుంట సమీపంలో వాగు రహదారిపై ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

మాయలూరు(ఉయ్యాలవాడ): మాయలూరు ఎస్సీ కాలనీలో ఎం. అరవిందపై కుక్కలు దాడి చేశాయి. మెరుగైన చికిత్సకు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.